క్లుప్తంగా

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి



రక్తమార్పిడి అనంతరం చిన్నారిని పరామర్శిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని ప్రభుత్వ బోధనా ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తల సేమియా భవనంలో ఎనిమిది మంది తలసేమియా చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడికి నెలకు 150 నుంచి 200 యూనిట్ల రక్తం అవసరం అవుతోందని, స్వచ్ఛంద సంస్థలు, కళాశాలల విద్యార్థులు, ఉద్యోగస్తుల సహకారంతో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నా ఇంకా రక్తదాతల కొరత ఉంటోందన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన కలిగి స్వచ్ఛందంగా రక్తదానం చేసి తలసేమియా చిన్నారులను ఆదుకోవాలని కోరారు. తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు ఉచిత భోజనం ఏర్పాటు చేసిన దాత వీఎస్ఆర్ ప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కే వరప్రసాదరావు, వీఎస్ఆర్ ప్రసాద్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళనకు సీపీఎం మద్దతు

ఏలూరు (టూటౌన్) : చింతలపూడి మండలం సీతానగరంలోని గోద్రేజ్ ఆగ్రోవెట్ పామాయిల్ ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళనకు సీపీఎం మద్దతు తెలుపుతున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో తెలిపారు. నియంతృత్వ పోకడలకు పాల్పడుతున్న ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, యూనియన్ రిజిస్ట్రేషన్ కొరకు దరఖాస్తు చేసిన ఆఫీసు బేరర్స్ అక్రమ బదిలీలు నిలుపుదల చేయాలని, కార్మిక చట్టాలు, కనీస వేతనాలు ఫ్యాక్టరీలో అమలు చేయాలని ఆయన కోరారు. పామాయిల్ ఫ్యాక్టరీ 2012 నుంచి పనిచేస్తున్నా అందులో యూనియన్ లేదన్నారు. ఈ క్రమంలో కార్మికులంతా సంఘటితమై ఈ యేడాది ఫిబ్రవరి 17న సీఐటీయూ అనుబంధంగా యూనియన్ ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. యూనియన్ రిజిస్ట్రేషన్ కొరకు డీసీఎల్‌కు దరఖాస్తు చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న యాజమాన్యం రిజిస్ట్రేషన్ జరగకూడదనే దురుద్దేశంతో యూనియన్ సభ్యులను మిజోరాం యూనిట్‌కు బదిలీ చేయడం కక్ష సాధింపు చర్య అని విమర్శించారు. తక్షణం 5గురు కార్మికుల అక్రమ బదిలీలను నిలుపుదల చేయాలని, ఫ్యాక్టరీలో కార్మిక చట్టాలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి డిమాండ్ చేశారు.



సెయింట్ థెరిస్సా కళాశాల పరీక్షా కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు, నిబంధనలు పాటించాలని ఏర్పాటు చేసిన బోర్డు (అంతరచిత్రం)



ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల కేంద్రం నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

పరీక్షా కాలం

నగరంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ భాషా పరీక్షలు జరిగాయి. ఏలూరు సెయింట్ థెరిస్సా, సీఆర్ రెడ్డి కళాశాలల వద్ద నెలకొన్న దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



పరీక్ష ఎలా రాశావు..



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

జగనన్న వెంటే విశ్వబ్రాహ్మణులు

ఏలూరు (టూటౌన్) : రానున్న ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులు అందరూ జగనన్న వెంటే ఉంటారని, ఆయన విజయానికి అందరూ కంకణబద్ధులై ఉండాలని రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణ ప్రజా ప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారికి తాడేపల్లిలో ఒక్కరోజు ట్రెనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుడు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను రాజగోపాలాచారి ఏలూరులో తన కార్యాలయం నందు బుధవారం తెలియజేశారు. మంగళసూత్రాలు తయారు చేసే హక్కు విశ్వబ్రాహ్మణులకు కల్పించాలని, వడ్రంగి పనిచేసే వారికి సబ్సిడీపై కలప ఇవ్వాలని, ఫారెస్టు అధికారుల వేధింపులు లేకుండా చూడాలని,, స్వర్ణకారులకు జీవో నెం.272ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, కులవృత్తులు చేయడం వల్ల ఆరోగ్యాలు దెబ్బతినడం వంటి సమస్యలు విశ్వబ్రాహ్మణులకు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని శిక్షణా కార్యక్రమంలో కోరినట్లు చెప్పారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ చారితో కలిసి పలు సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. నవరత్నాలు కమిటీ వైస్ చైర్మన్ ఏ.నారాయణ మూర్తి, కందుకూరి గురువాచారి, పలమనేరు మున్సిపల్ చైర్మన్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, పలువురు నేతలు పాల్గొన్నారన్నారు.



జంగాకృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు

బహుజనులు రాజ్యాధికారం సాధించాలి

ఏలూరు (టూటౌన్) : స్థానిక నరసింహారావుపేటలోని జె అండ్ జె కరుణోదయ సంస్థ కార్యాలయం వద్ద కరుణోదయ సంస్థ, ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో బుధవారం కాన్షీరామ్ 89వ జయంతి నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ మోనిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు మేతర అజయ్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కరుణోదయ సంస్థ చైర్మన్ కలతోటి డోమ్నిక్, మేతర అజయ్ బాబు మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ భావజాలంతో వారి మార్గాలలో నడిచిన గొప్ప నాయకుడు కాన్షీరామ్ అని, ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితమిచ్చి దేశ చరిత్రలో ఎనలేని కీర్తిని గడించారన్నారు. బహుజనులు రాజ్యాధికారం సాధించిన నాడే కాన్షీరామ్‌కు ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కాశీ కృష్ణ, అశోక్, విజయ్ బాబు, రామ్ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక తూర్పు వీధి కొత్తరోడ్లో గల నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో కాన్షీరామ్ జయంతి నిర్వహించారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేతల రమేష్ బాబు మాట్లాడుతూ కాన్షీరామ్ ఆశయ సాధనకు బహుజనులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్ కుమార్, ఏలూరు జిల్లా బాంసెఫ్ కో–కన్వీనర్ ఫరీద్ ఖాసిం, దాసి వెంకటేశ్వర్లు, భూపతి అప్పారావు, మేడిశెట్టి గిరిబాబు, పుట్టి వెంకన్న, దొవులూరి యేసు రత్నం, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.



కాన్షీరామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రికి వినతి



విజయవాడలో మంత్రి ముత్యాలనాయుడును కలిసి వినతిపత్రం అందిస్తున్న ఆపరేటర్లు

ఏలూరు రూరల్ : పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖామంత్రి బూడి ముత్యాలనాయుడు హామీ ఇచ్చారని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ ఆపరేటర్ల వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కేవీ నారాయణదాసు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలుసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా గ్రామ పంచాయతీ ఆపరేటర్లుగా పనిచేస్తున్నందున ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెంచి, క్రమం తప్పకుండా అందించాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి బూడి ముత్యాలనాయుడు ఆపరేటర్ల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానన్నారని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో సొసైటీ ఉపాధ్యక్షులు కె.ధనుంజయ, కార్యదర్శి కె.ఆనంద్, కోశాధికారి ఎస్.అహ్మద్, కార్యదర్శి కె.లావణ్యతో పాటు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాసేపు సేదతీరుదాం..

ఎండలు మండిపోతున్నాయి. ఇలాంటి తరుణంలో వేడిని తట్టుకోవడానికి నగరంలోని ఏళ్ల నాటి భారీ వృక్షాలు గొడుగులుగా నీడనిస్తున్నాయి. వేడిని తట్టుకునేందుకు చల్లటి గాలులు వీస్తూ నగర ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్నాయి. చెట్టు కనిపిస్తే చాలు.. ప్రజలు ఎండకు తట్టుకోలేక కాసేపు సేదతీరి వెళ్తున్నారు. ముఖ్యంగా కలెక్టర్ బంగ్లా, ఎస్పీ కార్యాలయం వైపు, ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో, కలెక్టర్ కార్యాలయం వద్ద ఎన్నో ఏళ్ల నాటి ఈ వృక్షాలు చల్లదనాన్ని పంచుతున్నాయి.


– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



సీఆర్‌రెడ్డి కళాశాల రోడ్డు



కలెక్టర్ బంగ్లా రోడ్డు



ఎస్పీ కార్యాలయం వద్ద

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	19	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	08–10
బెండకాయలు	54	కంద	46
పచ్చిమిర్చి	38	బీట్‌రూట్	34
కాకర కాయలు	40–44	కీరా దోస	36
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	56	అల్లం	80
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	44	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	46	పుదీనా	05
దోసకాయలు	30–44	బఠాణి	76
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24–32

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	19

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	11
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	32
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

భీమడోలు రైల్వే గేటు నుంచి రాకపోకల పునరుద్ధరణ

భీమడోలు: జాతీయ రహదారికి అనుకుని ఉన్న భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు పూర్తి కావడంతో బుధవారం ఉదయం నుంచి వాహనాల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. ట్రాక్ అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ సాయంత్రం వరకు మూసి వేస్తున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి గడువు సమయం కన్నా ముందుగానే పూర్తి చేసారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బీటీ రోడ్డు నిర్మించారు. దీనితో బుధవారం ఉదయం నుంచే గేటు తెరచుకుంది. ప్రధానంగా భీమడోలు వారపు సంత కావడంతో వ్యాపారులతో పాటు అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీనితో గేటు మీదుగా భారీ వాహనాలు రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని డిమాండ్

పెదవేగి : దిగుబడి రాక నష్టపోతున్న సీడ్, కమర్షియల్ మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెదవేగి మండలంలోని పెదవేగి, కూచింపూడిలో ఆయన పర్యటించి సీడ్, కమర్షియల్ మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంట దిగుబడి, పెట్టుబడి ఖర్చులు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని మెట్ట ప్రాంతంలో సీడ్ , కమర్షియల్ మొక్కజొన్న పంట రైతులు చేతికి వచ్చిందని చెప్పారు. గతేడాది కంటే వాతావరణ మార్పులు, తెగుళ్లు, ఇతర కారణాలతో దిగుబడులు తగ్గి రైతుల నష్టపోతున్నారని తెలిపారు. కౌలు, పెట్టుబడి కలిపి ఎకరా సాగుకు రూ.80 వేలకు పైగానే ఖర్చు అవుతోందని చెప్పారు. దిగుబడి మూడు టన్నులకు మించి రావడం లేదని అన్నారు. సీడ్ కంపెనీలు టన్నుకు రూ.25 వేలు ఇస్తున్నాయని ఫలితంగా మొక్కజొన్న కౌలు రైతులు నష్టపోతున్నారని అన్నారు. సీడ్ కంపెనీలు రైతులను ఆదుకోవాలని కోరారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు తెరిచి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె. నాగేశ్వరరావు పలువురు మొక్కజొన్న రైతులు పాల్గొన్నారు.



కూచింపూడిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రైతు సంఘ నేత శ్రీనివాస్

తొలగించిన సిబ్బందిని విధుల్లోకి చేర్చుకోవాలి

ద్వారకాతిరుమల: శ్రీవారి అన్నదాన భవనంలో విధుల నుంచి తొలగించిన కాంట్రాక్టు సిబ్బందిని వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, మండల కార్యదర్శి ఆదికృష్ణ బుధవారం ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. జీతాలు పెంచమని అడిగిన కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించడం దారుణమన్నారు. కొంతమంది దేవస్థానం అధికారులు తమకు అనుకూలంగా ఉన్నవారికి జీతాలను పెంచుతున్నారని, అలాగే కాంట్రాక్టర్లు, కొందరు అధికారులు కుమ్మక్కై కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి చేర్చుకోవాలని, లేకుంటే దీక్షలకు దిగుతామన్నారు.

21 నుంచి జగనన్న గోరుముద్దలో రాగి జావ

నిడమర్రు: జగనన్న గోరుముద్ద పథకంలో ఈనెల 21 నుంచి రాగి, బెల్లం మిశ్రమ జావ ఉదయం పూట విద్యార్థులకు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో పుచ్చల శేష అన్నారు. బుధవారం దేవరగోపవరం పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలకు రాగి జావ తయారికీ సంబంధించిన రాగి పిండి, బెల్లం పౌడర్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. వాటి వివరాలు ఐఎంఎంఎస్ యాప్‌లో నమోదు చెయ్యాలన్నారు. 21న విద్యార్థుల తల్లిదండ్రులను, స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి వారి సమక్షంలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించాల్సిన భోజన పథకం, జగనన్న విద్యాకానుక, నిధుల నిర్వహణ వంటి రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయుల టీచర్స్ డైరీలు, పాఠ్యప్రణాళికలు తనఖీ చేసి తగిన సూచనలు అందించారు. ఈ నెలలో జరిగే పాఠశాలల వార్షిక తనిఖీలకు అన్ని రికార్డులు సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట జల్లా ఏసు ఉన్నారు.

ఎండుమిర్చి అమ్మకాలు ప్రారంభం

పోలవరం రూరల్ : వైఎస్సార్ క్రాంతి పథం (వెలుగు) ద్వారా ఎండుమిర్చి అమ్మకాలు ప్రారంభించినట్లు ఏపీఎం బి.శ్రీనివాసరావు తెలిపారు. కొత్త నూతనగూడెంకు చెందిన గ్రామ సంఘం ఆధ్వర్యంలో నాణ్యమైన ఎండుమిర్చిని వేలేరుపాడు, కుకునూరు, భద్రాచలం ప్రాంతానికి వెళ్లి కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సంఘాలకు తక్కువ ధరకే నాణ్యమైన ఎండుమిర్చిని అందించాలనే ఉద్దేశంతో ఈ పథకం ప్రాంరభించినట్లు పేర్కొన్నారు. కేజీ రూ.250కు వీటిని అమ్ముతున్నట్లు తెలిపారు. ముగ్గురు కమిటీ సభ్యులుగా ఏర్పడ్డారని, రూ.15 లక్షల నిధులతో మిరపకాయలు కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ విజయరావు సూచనల మేరకు మండల సమాఖ్య ద్వారా ఈ ఏడాది మిర్చి అమ్మకాలు ప్రారంభించామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న వితా శ్రీనివాసరావుకు, కుసుమకు పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఒక పాప, బాబు ఉన్నారు. వివాహ సమయంలో కట్నంగా రెండున్నర ఎకరాల భూమి, 45 కాసుల బంగారం, 15 లక్షల నగదు, 2కేజీల వెండి ఇచ్చారు. అయితే ఇటీవల అదనంగా కట్నం తీసుకురావాలని, లేకపోతే చంపుతానని, విడాకుల ఇస్తానని భర్త శ్రీనివాసరావు బెదిరిస్తున్నాడని, దీనికి అతని తల్లిదండ్రులు, అక్క చెల్లెళ్లు సహకరిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ కుసుమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై చెప్పారు.